సాక్షి నిర్మల్

శుక్రవారం ♦ 6 ♦ డిసెంబర్ ♦ 2024

SAMAGRA SHIKSHA ABHIYAN

'సమగ్ర శిక్ష'లో సమ్మె సైరన్

సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు నేటి నుంచి సమ్మె బాట పట్టనున్నారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని సమ్మె చేయాలని నిర్ణయం తీసుకున్నారు. 8లో▸

పకడ్బందీగా 'సీఎం కప్'

నిర్మల్‌చైన్‌గేట్: సీఎం కప్ క్రీడలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఔత్సాహికులైన క్రీడాకారులు పోటీలలో పాల్గొనడానికి cmcup2024. telangana. gov. in లింకు ద్వారా ఈనెల 6వలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 99511 98890 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.1 /22.2

ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చల్లగాలులు వీస్తాయి. చలి ప్రభావం చాలా వరకు తగ్గుతుంది.

న్యూస్‌రీల్

ఎన్‌సీసీ పురస్కారాలు



పురస్కారాలతో జిల్లా ఎన్‌సీసీ బృందం

నిర్మల్‌టౌన్: ఆదిలాబాద్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఎన్‌సీసీ రెండో వార్షిక శిక్షణ కార్యక్రమంలో నిర్మల్ జిల్లాకు చెందిన పలువురికి ఉత్తమ పురస్కారాలు లభించాయి. నర్సాపూర్(జి), కడెం, పోన్కల్ పాఠశాలలకు చెందిన సాయినాథ్, వినోద్‌కుమార్, పూర్ణచందర్‌కు 32వ తెలంగాణ పటాలం కమాండింగ్ అధికారి కల్నల్ వికాస్‌శర్మ ఉత్తమ పురస్కారాలు ప్రదానం చేశారు.

బాక్సింగ్‌లో ప్రతిభ



అభినయను సన్మానిస్తున్న ఎస్‌వో లతాదేవి, పీఈటీ ప్రియాంక

సోన్: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో సోన్ కేజీబీవీలో 10వ తరగతి విద్యార్థి అభినయ కాంస్య పతకం సాధించిందని పాఠశాలవ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రియాంక, ఎస్ఓ లతాదేవి గురువారం తెలిపారు. 50 కేజీల విభాగంలో అభినయ ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. కాంస్య పథకం సాధించిన విద్యార్థినిని అభినందించారు.

మైనార్టీ కళాశాలను తనిఖీ చేసిన డీఐఈవో

ఖానాపూర్: పట్టణంలోని హైటెక్‌సిటీలో ఉన్న మైనార్టీ జూనియర్ కళాశాలను డీఐఈవో పరుశురాం గురువారం తనిఖీ చేశారు. కళాశాలలో ప్రవేశాలు, తరగతుల నిర్వహణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పరిశీలించారు. వార్షిక పరీక్షలకు విద్యార్థులు ప్రణాళికతో చదవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యం, కళాశాల కోఆర్డినేటర్ సలీం, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యా కమిషన్ చైర్మన్‌కు వినతి



విద్యాకమిషన్ చైర్మన్‌తో మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

నిర్మల్ రూరల్: జిల్లాకు వచ్చిన విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళిని వివిధ ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా పలు విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. 317 జీవో బాధిత ఉపాధ్యాయులను సొంత జిల్లాకు పంపించాలని, ఇటీవల జరిగిన బదిలీల్లో జరిగిన పొరపాటుతో దూర ప్రాంతాలకు వెళ్లిన ఉపాధ్యాయులను ఖాళీగా ఉన్న పోస్టుల్లో భర్తీ చేయాలని వినతిపత్రం అందజేశారు. ఇందులో ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు భూమన్నయాదవ్, టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తోడిశెట్టి రవికాంత్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి శంకర్, పీఆర్టీయూ టీజీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాటకారి సాయన్న, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'చలో బస్ భవన్'కు ఆర్టీసీ కార్మికులు

నిర్మల్‌టౌన్: టీఎంయూ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో బస్ భవన్ కార్యక్రమానికి నిర్మల్ డిపోకు చెందిన కార్మికులు ప్రత్యేక వాహనంలో గురువారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా రీజినల్ సెక్రెటరీ గంగాధర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఆర్టీసీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ హామీలను నెరవేర్చాలని, సమస్యలు పరిష్కరించాలని కోరారు.

కొన్నది సగమే..!



లోకేశ్వరంలో వరి ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

నగర్ గ్రామంలో సన్నరకం ధాన్యం తూకం..

- ధాన్యం కొనుగోళ్లలో జాప్యం..
- ప్రైవేటుగా అమ్ముకున్న రైతులు
- సేకరణ లక్ష్యం 1.47 లక్షల మెట్రిక్ టన్నులు
- కొనుగోలు చేసింది 71 వేల మెట్రిక్ టన్నులే..

మొత్తం 8828 మంది రైతులకు రూ.98 కోట్లు	సన్న రకం ధాన్యం విక్రయించిన రైతులు 1287	1001 మంది రైతులకు బోనస్ కింద రూ.10 కోట్లు

లోకేశ్వరం: ధాన్యం సేకరణలో అధికారుల అంచనా తప్పింది.1.47 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేశారు. ఈమేరకు 308 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే ఇప్పటి వరకు 71 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు.

జిల్లాలో 1.47 లక్షల ఎకరాల్లో సాగు..

జిల్లా వ్యాప్తంగా వానాకాలం సీజన్‌లో 1.47 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగుచేశారు. సన్న, దొడ్డు రకం కలిపి 1.47 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికా రులు అంచనా వేశారు. ఇందు కోసం 308 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో దొడ్డు రకం ధాన్యం కోసం 189, సన్నవడ్ల కోసం 119 కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే మిల్లర్లతో జరిపిన చర్చలు విఫలం కావడంతో ధాన్యం సేకరణ సకాలంలో ప్రారంభం కాలేదు. నవంబర్ మొదటి వారంలో పది రోజులు వర్షాలు కురిశాయి. దీనికితోడు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభం కావడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించారు.

8,828 మంది రైతులకు రూ.98 కోట్లు..

ధాన్యం విక్రయించి, సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించిన రైతుల బ్యాంకు ఖాతాల్లో వారం రోజుల్లోనే డబ్బులను ప్రభుత్వం జమ చేస్తోంది. జిల్లాలో ఇప్పటి వరకు 8,828 మంది రైతులు 71 వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం విక్రయించారు. వీరికి ప్రభుత్వం రూ.98 కోట్లు చెల్లించింది.

1,287 మంది రైతులకు బోనస్...

ప్రభుత్వం సన్న రకాలకు రూ.500 బోనస్ చెల్లిస్తోంది. ఇప్పటి వరకు జిల్లాలో 1,287 మంది రైతుల నుంచి 12 వేల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యం సేకరించగా వారికి రూ.14 కోట్లు చెల్లించాల్సి ఉండగా, 1001 మంది రైతులకు రూ.10 కోట్లు ఖాతాల్లో జమ చేశారు. ధాన్యం మద్దతు ధర డబ్బులతో కాకుండా బోనస్ డబ్బులు వేరుగా జమ చేస్తున్నారు.

రైతులకు నష్టం..

సకాలంలో కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో చాలా మంది రైతులు దళారులకు తక్కువ ధరకు ధాన్యం విక్రయించి నష్టపోయారు. దొడ్డు రకం ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,320 ఇవ్వగా, దళారులు క్వింటాల్‌కు రూ.2 వేల నుంచి రూ.2,200 మాత్రమే చెల్లించారు. ఇక సన్నాలకు ప్రభుత్వం రూ.500 బోనస్‌తో కలిపి క్వింటాల్‌కు రూ.2,800 ఇవ్వగా, వ్యాపారులు మాత్రం రూ.2,400 నుంచి రూ.2,600 మాత్రమే చెల్లించారు.

బోనస్‌తో ఆనందంగా ఉంది



కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇస్తామని ప్రకటించాగానే కన్నపూర్ శివారు ప్రాంతంలో ఉన్న మూడెకరాల్లో సన్న వడ్లు సాగు చేసిన. మూడు ఎకరాలకు 220 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చింది. ధాన్యం డబ్బులతోపాటు రూ.44 వేల బోనస్ రావడం ఆనందంగా ఉంది.

– ముత్యం, కన్నాపూర్

దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వాలి..



మండల కేంద్రంలో నాకు ఉన్న భూమిలో సన్నాలు సాగు చేశాను. దిగుబడి తక్కువ వచ్చింది. అయినా ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించడంతో నష్టం రాలేదు. దొడ్డు వడ్లకు కూడా ప్రభుత్వం బోనస్ ఇవ్వాలి.

– మహిపాల్, కుంటాల

జనవరి 10 వరకు కొనుగోళ్లు..

జిల్లాలో సగానికిపైగా ధాన్యం సేకరించాం. రైతులు పండించిన ప్రతీ గింజ కొనుగోలు చేస్తాం. జనవరి 10 వరకు కొనుగోళ్ల కేంద్రాలు తెరిచే ఉంటాయి. నిర్ణీత లక్ష్యం మేరకు సేకరించకపోయినా రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తాం.

– కిరణ్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

ఎందుకింత బరితెగింపు..!?

- వేలల్లో వేతనాలున్నా..
- సర్కారు సౌకర్యాలు కల్పిస్తున్నా..
- అత్యాశతో చేతులు చాస్తూ.. సీబీకి చిక్కుతూ..
- వరుస ఘటనలపై జిల్లావాసి ఆవేదన



లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అధికారులు (ఫైల్)

నిర్మల్: 'అగో ఏంరా..! మీ జిల్లాల నెలరోజుల్లోనే ముగ్గురు ఏసీబీకి దొరికింగ్రట గదా. మీదగ్గర మస్తు అమ్దాని ఉన్నట్లున్నదిలె..' అని పక్క జిల్లోల్లు అంటుంటే ఇజ్జత్ పోయినట్లనిపిస్తున్నది. మొన్ననే తమ దగ్గర పనిచేసేటాయన పేరును సర్వీస్‌బుక్‌ల ఎక్కియనీకి రూ.15 వేలు అడిగి మున్సిపల్‌ల దొరికింద్రు. నిన్ననే సేత్వార్ కోసం రూ.పది వేలు తీసుకుంట ఇద్దరు పట్టువడ్డరు. అరె.. నెలన్న కాలే.. మల్లా ఇప్పుడు ఎడ్లఅంగడిల దడువాయి దగ్గర రూ.7 వేలు తీసుకుంట మార్కెటింగ్ అధికారి బుక్కయ్యిండు. కిందిస్థాయిలంటే జీతాలు తక్కుంటయని పదోపరకో అడిగి తీసుకుంటే ఓ లెక్క. లక్ష దాటి జీతాలున్న పెద్దసార్లూ.. పెద్దపెద్ద సదువులు సదివినోళ్లు.. జిల్లా బాసులం.. అని చెప్పుకునేటోళ్లూ.. చేతులు చాచడమేంది..!? లేనోడినీ వదలకుండా తిప్పితిప్పి అడుక్కోవడమేంది..!?'

జీతం లెక్కలకు రాదా..!

సర్కారు నౌకరీ ఉన్నోళ్లకు గతంలో కన్నా ఇప్పుడు మంచి జీతాలున్నయ్. కొంతమందికి ఊహించని స్థాయిల వేతనాలు, చేసే పనిల ఇబ్బంది కలుగకుండా సర్కారు నుంచే అన్ని సదుపాయాలు, నువ్వు ఏ పనిచేస్తా అంటే అది చేయు అనేలా స్వేచ్ఛ.. ఇవన్నీ ఉన్నయ్. అయినా.. మల్ల అదేం పాడుబుద్ధో. పైసలు చేతుల పెడితేనే పనిచేస్తున్నరు.

చేయిచాచి అడుగుతున్నరు..

జిల్లాల చాలామంది సార్లు తాము సదువుకున్న సదువుకు, చేస్తున్న నౌకరీకైనా గౌరవం ఇస్తలేరు. మన దగ్గరకు ఏం పనొచ్చింది.. ఇందులో ఎట్ల పైసలు సంపాదించాలె.. ఇగో గివే లెక్కలేస్తున్నరు. లేదంటే.. ఓళ్ల పని ఇది.. చలో ఆళ్లను పిలువాలె.. గీ పని కావాలంటే గింత ఇవ్వాలె అంటూ చేయిచాచి మరీ అడుక్కుంటున్నరు. ఇగ సంపాదన ఎక్కువుండి, అడుక్కోవడానికి మొహమాటం పడే సార్లు తెలివిగా.. తమ కింద ఒకరిద్దరు ప్రైవేటు అసిస్టెంట్లను ఎంతోకొంత జీతమిచ్చి పెట్టుకుంటున్నరు.

'పెద్ద సారు.. చిన్నబుద్ధి..

యథారాజా.. తథాప్రజా.. అని ఊరకనే పెద్దోళ్లు అనలేదు. జిల్లాల కూడా అట్లనే ఉన్నది. ఇప్పటిదాకా ఏసీబీ వలకు చిన్నచేపలే చిక్కుతున్నయ్. ఇంతకంటే పెద్దపెద్ద తిమింగాలు ఉన్నయ్. జిల్లాలో పనిచేస్తున్న ఓ 'పెద్ద'సారు తీరుపై బయట అందరూ చెప్పుకుంటున్నరు. ఆ సారు తన పరిధిలో ఉన్న ఏ పనిని ఇడిసిపెట్టడట. ప్రతీదాంట్ల ఎంతిస్తరు.. ఎంతస్తయి.. గివే ముచ్చట్లట. ఆఖరికి తన పరిధిలో ఉన్న ఉద్యోగులు, సిబ్బంది బదిలీ చేయాలన్న, ప్రమోషన్లు ఇవ్వాలన్నా.. చేయి తడపాల్సిందేనట.

మెచ్చుకోవాల్నా.. తిట్టుకోవాల్నా..

జిల్లాల నెలల వ్యవధిలోనే వరుసగ ఏసీబీవాళ్లు దాడులు చేస్తున్నరు. పాపం.. వాళ్లకు ఒక కేసు కంప్లీట్ చేసేంత టైము కూడ ఇయ్యకుండ వెంటవెంటనే జిల్లాకు రప్పిస్తున్నరు. అసలు.. తమను లంచాలు అడుగుతున్నోళ్లను ఏసీబీ పట్టించేంత ప్రజల్ల చైతన్యమచ్చిందని సంతోషపడాల్నా.. లేక అడ్డూఅదుపు లేకుండా జిల్లాల లంచావతారులు చేస్తున్న దోపిడీకి బాధపడాల్న తెలుస్తలేదు' ఇదీ సగటు జిల్లావాసి ఆవేదన.. ఆక్రోశం.

నాణ్యమైన విద్య... మెరుగైన వసతులు



ట్రిపుల్‌ఐటీలో అధ్యాపకులు, విద్యార్థులతో రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

- ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు విద్యా కమిషన్ చైర్మన్ హామీ
- వర్సిటీని సందర్శించిన ఆకునూరి మురళి

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన వసతులు కల్పించాలని రాష్ట్ర విద్య కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. బాసర క్యాంపస్‌ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వీసీ గోవర్ధన్, అధ్యాపకులు, ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులతో ముఖా ముఖి నిర్వహించారు. ట్రిపుల్‌ఐటీలో అందుతున్న కోర్సులు, సౌకర్యాలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడారు. తెలంగాణ వ్యాప్తంగా మెరుగైన విద్యార్థులే ఈ క్యాంపస్‌లో సీట్లు దక్కించుకుని చదువుతున్నారన్నారు. ఇక్కడ చదివే విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ప్రతీరోజు మెనూ ప్రకారం భోజనం అందించాలని తెలిపారు. పరీక్షల నిర్వాహణపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. నాణ్యమైన బోధనతోపా టు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నతస్థానాల్లో నిలవాలని సూచించారు. అధ్యాపకుల ఇబ్బందులు, ట్రిపుల్‌ఐటీలో కల్పించాల్సిన సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు.

పరిశుభ్రతపై దృష్టిసారించాలి..

అనంతరం ట్రిపుల్‌ఐటీలో వంటగదిని పరిశీలించారు. పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులకు సూచించారు. వంటగదిలో పాత్రలను పరిశీలించారు. వండిన పదార్థాలు, ఇతర సామగ్రిని పరిశీలించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు అందించే భోజనంలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని సూచించారు. నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన వంట సరుకులను, కూరగాయలను వినియోగించాలని సూచించారు. వంటచేసే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.



వంట గదిని పరిశీలిస్తున్న రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

క్యాంపస్‌లో తిరుగుతూ...

ట్రిపుల్‌ఐటీ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్‌తో కలిసి క్యాంపస్‌లో తిరుగుతూ అన్నింటిని పరిశీలించారు. భోజనశాల, విద్యార్థుల వసతిగృహాలకు వెళ్లారు. గదులకు వెళ్లి అక్కడి ఫర్నిచర్‌ను పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థులకు ఉన్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. బోధన సామగ్రి, సాంకేతిక వనరులను అందుబాటులో ఉంచాలని సూచించారు. జిమ్, బ్యాడ్మింటన్ కోర్టు సందర్శించారు. తాగునీటి సరఫరా, ట్రిపుల్‌ఐటీలో సీసీ టీవీల పర్యవేక్షణ, సెక్యూరిటీతోపాటు భద్రత చర్యలపై ఆరాతీశారు. అక్కడి నుంచి కబడ్డీ కోర్టు, ఖోఖో కోర్టుకు వెళ్లి పరిసరాలు పరిశీలించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీ మాజీ డైరెక్టర్ మురళీదర్శన్, ట్రిపుల్‌ఐటీ ఏవో రణధీర్‌సాగి, డీఈవో రామారావుతోపాటు, అధికారులు ఉన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచే బాధ్యత ఉపాధ్యాయులదే

- రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

నిర్మల్‌చైన్‌గేట్: విద్యా ప్రమాణాలు మెరుగుపరిచే బాధ్యత ప్రతీ ఉపాధ్యాయునిపై ఉందని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. కలెక్టరేట్ సమావేశం మందిరంలో కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం సమీక్ష చేశారు. ఉపాధ్యాయుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. అనంతరం మురళి మాట్లాడారు. ప్రతీ విద్యార్థి చదవడం రాయడం వచ్చేలా నాణ్యమైన విద్యను అందించాలన్నారు. విద్యార్థులు మంచి విద్యను అభ్యసించేందుకు పాఠశాలల్లో ఆరోగ్యకరమైన వాతావరణం సృష్టించాలన్నారు. ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యచరణలు రూపొందించి చదువులో వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. మెరుగైన విద్యతోపాటు, నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేజీబీవీలు, సంక్షేమ, వసతి గృహాలు, ఇతర ప్రభుత్వ పాఠశాలలను మండల ప్రత్యేక అధికారులు ప్రతీ మంగళ, శుక్ర వారాల్లో తనిఖీ చేస్తూ విద్య, భోజనం, కల్పిస్తున్న వసతులను పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. విద్యార్థులందరికీ నాణ్యమైన భోజనం అందిస్తున్నామన్నారు. ఇప్పటికే జిల్లాలోని వసతిగృహాల ప్రత్యేక అధికారులు, ప్రిన్సిపాళ్లు, విద్య శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, డీఈవో రామారావు, జిల్లా సంక్షేమ శాఖల అధికారులు అంబాజీ, రాజేశ్వర్‌గౌడ్, మోహన్ సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్

- సెయింట్ థామస్ పాఠశాలలో కార్యక్రమం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న జిల్లా సైన్స్ అధికారి

నిర్మల్ రూరల్: జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మేళా, విద్య వైజ్ఞానిక ప్రదర్శన శుక్రవారం జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలలో ప్రారంభం కానుంది. రెండు రోజులు జరిగే ఈ ప్రదర్శన కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, కలెక్టర్ అభిలాష అభినవ్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఉదయం 11 గంటలకు వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభమవుతుంది. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి సుమారు 600 ఎగ్జిబిట్లు వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. వివిధ పాఠశాల నుంచి వచ్చే విద్యార్థులు భోజనం, వసతి కల్పిస్తారు. జిల్లా సైన్స్ అధికారి వినోద్‌కుమార్ గురువారం సెయింట్ థామస్ పాఠశాలలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

సారంగాపూర్: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ సూచించారు. మండలంలోని జామ్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం, రికార్డులు, రైతులకు అందిన ధాన్యం డబ్బుల వివరాలు నిర్వాహకుడు రవిని అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ అక్కడ ఉన్న సమయంలో చినుకులు రావడంతో వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేసి ధాన్యంపై టార్పాలిన్‌లు కప్పేలా పురమాయించారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ..

జామ్ గ్రామం నుంచి నేరుగా సారంగాపూర్ చేరుకున్న అదనపు కలెక్టర్ తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను భద్రపరిచే గదిని పరిశీలించి రికార్డు గది నిర్వాహకులకు సూచనలు చేశారు. అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు నిర్వహించే గదిని పరిశీలించి తహసీల్దార్ శ్రీదేవిని పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంఆర్‌ఐలు ఉన్నారు.

వ్యాధుల వివరాలు పోర్టల్‌లో నమోదు చేయాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజేందర్

నిర్మల్‌చైన్‌గేట్: మలేరియా, ఫైలేరియా, డెంగీ, ఇతర వ్యాధుల వివరాలు, పరీక్షల ఫలితా లు నిత్యం ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫాం పోర్టల్‌లో నమోదు చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. డీఎంహెచ్ఓ కార్యాలయంలో మైక్రో ఫైలేరియా శాంపుల్ కలెక్షన్, ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్ ఫామ్ పోర్టల్‌లో నమోదు చేసే విధానంపై గురువారం అవగాహన కల్పించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ స్టేట్ కన్సల్టెంట్ డాక్టర్ శిరీష వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఈనెల 9న నిర్వహించే మైక్రో ఫైలేరియా నైట్ బ్లడ్ సర్వే పకడ్బందీగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నిర్వహణ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి, సబ్ యూనిట్ అధి కారి సుధాకర్ ఆరోగ్య పర్యవేక్షకులు భోజా రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి జిల్లాలోని వైద్యాధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులు ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్ అన్నారు. పట్టణంలోని ఈద్గాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను గురువారం సందర్శించారు. విద్యార్థులందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, వంట చేసేటప్పుడు పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సౌమ్య, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారే రవీందర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సర్వీసు రోడ్డుపై లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

నేరడిగొండ(బోథ్‌): మండల కేంద్రంలోని సర్వీసు రోడ్డుపై గురువారం తెల్లవారు జామున హైదరాబాద్‌ నుంచి నాగ్‌పూర్‌కు పేపర్‌ లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. దీంతో ఆ రోడ్డు గుండా నిర్మల్‌ నుంచి ఆదిలాబాద్‌, బోథ్‌ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు జాతీయ రహదారి పైనుంచి వెళ్లడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 3.30 గంటల వరకు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు స్పందించకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆ తర్వాత యధావిధిగా వాహనాలు రాకపోకలు సాగించాయి.

రైతుపై అడవిపంది దాడి



ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు

ఇంద్రవెల్లి(ఖానాపూర్‌): రైతుపై అడవి పంది దాడిచేసిన ఘటన మండలంలోని ముత్నూర్‌లో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మడావి నాగోరావ్‌ గురువారం మధ్యాహ్నం మెండపల్లి శివారులోని తన చేనులో పత్తి ఏరుతుండగా అకస్మాత్తుగా అడవిపంది దాడి చేసింది. తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఒకరికి దేహశుద్ధి

దండేపల్లి: మండలంలోని లింగాపూర్‌ గ్రామానికి చెందిన ఒకరు గురువారం అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. విషయం తెలుసుకున్న సదరు మహిళ కుటుంబ సభ్యులు అతనికి దేహశుద్ధి చేయడంతో పాటు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్సై ఉదయ్‌కిరణ్‌ను సంప్రదించగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పేర్కొన్నారు.

అత్యాచారయత్నం కేసులో ఒకరికి జైలు

నిర్మల్‌టౌన్‌/నిర్మల్‌రూరల్‌: బాలికపై అత్యాచారానికి యత్నించిన కేసులో ఒకరికి నాలుగేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి కర్ణకుమార్‌ గురువారం తీర్పునిచ్చారు. కోర్టు సమన్వయల అధికారి డల్లు సింగ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్‌ రూరల్‌ మండలంలోని డ్యంగాపూర్‌కు ఏల్పుల చంద్‌ అలియాస్‌ చంద్రశేఖర్‌ 2021 మార్చి 31న అదే గ్రామానికి చెందిన బాలిక(15)పై అత్యాచారానికి యత్నించాడు. సదరు బాలిక తప్పించుకుని వెళ్లి తల్లికి చెప్పగా నిర్మల్‌ రూరల్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్సై సుమన్‌ కేసు నమోదు చేయగా డీఎస్పీ ఉపేందర్‌ దర్యాప్తు చేశారు. పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ విశ్వాస్‌రెడ్డి 10 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితునికి పైవిధంగా శిక్ష ఖరారు చేస్తూ తీర్పునిచ్చారు.

గంజాయి పట్టివేత

వాంకిడి: సవాతి గ్రామానికి చెందిన షిండె శ్యాంరావు ఇంట్లో విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన 1600 గ్రాముల గంజాయిని గురువారం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్‌ సీఐ రాణాప్రతాప్‌ తెలి పారు. తమకు అందిన పక్కా సమాచారం మేరకు శ్యాంరావు ఇంట్లో తనిఖీ చేయగా సుమారు రూ.40 వేల విలువైన గంజాయి లభ్యమైనట్లు తెలిపారు. గంజాయిని సీజ్‌ చేసి, నిందితున్ని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ పేర్కొన్నారు.

బొమ్మె చేపలు C/O హాజీపూర్‌!

- సంరక్షణ కేంద్రం ఏర్పాటుకు అనుమతులు
- ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌ వద్ద అంతర్జాతీయ స్థాయిలో కేంద్రం
- 30 ఎకరాల్లో రూ.15 కోట్లతో బొమ్మె చేపల పెంపకం



ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌ వద్ద బొమ్మె చేపల సంరక్షణ కేంద్రం ప్రతిపాదిత స్థలం ఇదే

మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): బొమ్మె చేపల పెంపకం, సంరక్షణ ప్రాజెక్టుకు మంచిర్యాల జిల్లా హాజీపూర్‌ మండలం వేదిక కానుంది. రాష్ట్ర ప్రభుత్వం బొమ్మె చేపల పెంపకాన్ని పెద్ద ఎత్తున చేపట్టబోతోంది. దేశంలోనే తొలిసారి జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్‌)కి చెందిన మంచినీటి చేపల పెంపకం సంస్థ సీఐఎఫ్‌ఏ (సెంట్రల్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ ఫ్రెష్‌ వాటర్‌ ఆక్వా కల్చర్‌) ఆధ్వర్యంలో బొమ్మె చేపల పెంపకం జరగనుంది.

బొమ్మె చేపల వృద్ధి లక్ష్యంగా..

తెలంగాణలో బొమ్మె చేపకు ప్రత్యేక స్థానం ఉంది. పొడవుగా, నునుపుగా ఉండటంతో పాటు అనేక పోషకాలతో నిండి ఉంటుంది. ఈ చేపను 2016లో ప్రభుత్వం రాష్ట్ర చేపగా గుర్తించింది. మత్స్యశాఖ ద్వారా బొమ్మె చేపల వృద్ధిని చేపట్టేందుకు నిర్ణయించింది. ఈ చేప జన్యువును లక్నోలోని నేషనల్‌ బ్యూరో ఆఫ్‌ ఫిష్‌ జెనెటిక్‌ రిసోర్స్‌లో భద్రపరిచి మరింత అభివృద్ధికి ప్రణాళికలు చేస్తోంది. అయితే ఈ చేపకు డిమాండ్‌ను అనుసరించి మార్కెట్‌లో హైబ్రీడ్‌ చేపలతో పాటు క్యాట్‌ ఫిష్‌లు విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే బొమ్మె చేప పెంపకం, వినియోగం పెంచేలా కొత్త ప్రాజెక్ట్‌కు ప్రభుత్వం ప్రతిపాదించగా కేంద్రం సైతం ఆమోదం తెలిపింది. దీంతో ఈ ప్రాజెక్ట్‌ కార్యరూపం దాల్చనుంది. త్వరలోనే ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నారు.

పెంపకం..సంరక్షణ..ఆపై ఎగుమతి

ఎల్లంపల్లి జలాశయం వద్ద బొమ్మె చేపల పెంపకం, సంరక్షణ కేంద్రం ఏర్పాటు జరుగుతోంది. బొమ్మెతో పాటు బురదమట్టలు, పూలమట్టలు, తదితర రకాల చేపల విత్తన కేంద్రం, పెంపకానికి హచరీలు సైతం ఇక్కడే ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాదు వీటి సంరక్షణ, వ్యాధుల నివారణకు ప్రత్యేక కేంద్రాన్ని కూడా ఇక్కడే ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేంద్రంలో ఉత్పత్తి అయ్యే చేప పిల్లలను ప్రభుత్వం ఏటా చేపట్టే చేపల పంపిణీ పథకానికి వినియోగించనున్నారు. ఇక మృగశిరకార్తెలో చేప ప్రసాదానికి కూడా వీటిని విక్రయించనున్నారు. అంతేకాకుండా రాష్ట్ర అవసరాలు తీరాక ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఈ ప్రాంత చేపలను ఎగుమతి చేయనున్నారు. మరోవైపు ఈ కేంద్రం శిక్షణకు ఉపయోగ పడటంతో పాటు చేపలపై విస్తృత స్థాయి పరిశోధనలకు నిలయంగా మారనుంది. ఫిష్‌పాండ్‌లో ఉన్న మిగిలిన 55 ఎకరాల్లో ఆక్వా కల్చర్‌ ఫాం ఆరు నెలల్లో పూర్తిస్థాయి వినియోగంలోకి రానుంది.

30 ఎకరాల్లో పెంపకం..

మంచిర్యాల జిల్లా హాజీపూర్‌ మండలం గుడిపేట గ్రామ శివారులోని గోదావరి నదిపై గల ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌ వద్ద ఫిష్‌పాండ్‌ కోసం 85 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేశారు. ఇరిగేషన్‌ శాఖ ఆధీనంలో ఉన్న ఈ స్థలాన్ని కలెక్టర్‌ ఆదేశాల మేరకు రెవెన్యూశాఖ ద్వారా మత్స్యశాఖకు అప్పగించే ప్రయత్నాలు చేస్తున్నారు. 85 ఎకరాల స్థలంలోని 30 ఎకరాల్లో బొమ్మె చేపల పెంపకం కోసం ప్రభుత్వం భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా కేంద్ర ప్రభు త్వ సహకారంతో రూ.15 కోట్లతో బొమ్మె చేపల పెంపకం, సంరక్షణ చేపడుతోంది. బొమ్మె చేపల జాతిని కాపాడటంతో పాటు చేపల సంఖ్యను గణనీయంగా పెంచేలా ప్రభుత్వం సంకల్పించింది.

ఆర్థికాభివృద్ధి దిశగా..

హాజీపూర్‌లో ఫిష్‌పాండ్‌, బొమ్మె చేపల పెంపకం చేపడుతుండగా ఈ ప్రాంత ప్రజలు ఉపాధి పొందటంతో పాటు ఆర్థికాభివృద్ధి సాధించే అవకాశాలు ఉన్నాయి. ఫిష్‌పాండ్‌లో ఉత్పత్తి అయ్యే చేప పిల్లలతో అర ఎకరం నుంచి ఎకరం ఆపై ఎంత విస్తీర్ణంలోనైనా సొంతంగా చేపల పెంపకం కోసం ఫిష్‌పాండ్‌లు ఏర్పాటు చేసుకుని పెంచుకునే అవకాశం ఉంది. పెంచిన చేపలను ఫిష్‌పాండ్‌ ద్వారా కొనుగోలు చేయనున్నారు. ఈ ప్రాంత మత్స్యకారులతో పాటు ప్రతీ ఒక్కరూ చేపల పెంపకం చేపట్టి ఆర్థికాభివృద్ధి దిశగా ముందుకు సాగనున్నారు. చేపల పెంపకంతో హాజీపూర్‌ మండలంలోని గుడిపేట భవిష్యత్‌లో దేశానికి మార్గదర్శనం కానుంది.

'సమగ్ర శిక్ష'లో సమ్మె సైరన్‌

- డిమాండ్లు నెరవేర్చాలని దీక్షలు
- ఈ నెల 6, 7 తేదీల్లో రిలే నిరసన దీక్షలు
- 9 నుంచి నిరవధిక దీక్షలు
- ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో 2,474 మంది ఉద్యోగులు



గతేడాది సమ్మెలో పాల్గొన్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు

జిల్లాల వారీగా ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు

జిల్లా	ఉద్యోగులు
మంచిర్యాల	596
ఆదిలాబాద్‌	657
నిర్మల్‌	702
కుమురంభీం	519
మొత్తం	2,474

లక్ష్మణచాంద(నిర్మల్‌): ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా వ్యాప్తంగా సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు నేటి నుంచి సమ్మె బాట పట్టనున్నారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి తెలిసేలా నేటి నుంచి సమ్మె చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు.

నేటి నుంచి సమ్మె బాటలో...

ఈనెల 6, 7 తేదీలలో ఆయా జిల్లా కేంద్రాల్లో రిలే నిరసన దీక్షలు చేపట్టనున్నారు. ఈ రెండు రోజుల్లో ప్రభుత్వం నుంచి స్పందన లేకుంటే ఈనెల 9 నుంచి నిరవధిక నిరసన దీక్ష చేపట్టనున్నారు.

ఉమ్మడి జిల్లాలో 2,474 మంది..

ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా వ్యాప్తంగా డీఈవో, ఎంఈవో కార్యాలయాలు, భవిత కేంద్రాలు, కేజీబీవీ టీచింగ్‌, నాన్‌ టీచింగ్‌ సిబ్బంది, యూఆర్‌ఎస్‌ పాఠశాలలో పనిచేస్తున్న టీచింగ్‌, నాన్‌ టీచింగ్‌ సిబ్బంది మొత్తం 2,474 మంది పనిచేస్తున్నారు.

డిమాండ్లు ఇవే...

1. ఎస్‌ఎస్‌ఏలో పనిచేస్తున్న ఉద్యోగులందర్నీ రెగ్యులర్‌ చేసి పేస్కేల్‌ అమలు చేయాలి.
2. రీ ఎంగేజ్‌ విధానం తొలగించాలి.
3. ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజీ ఇవ్వాలి.
4. పీటీఐలకు మిగిలిన ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల మాదిరి 12 నెలల వేతనం ఇవ్వాలి.
5. జీవిత బీమా, ఆరోగ్య బీమా కింద రూ.10 లక్షలు, పదవీ విరమణ బెనిఫిట్స్‌ కింద రూ.10 లక్షలు ఇవ్వాలి.

గతంలో హామీ ఇచ్చినా...

తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ గతంలో నిరసన చేపట్టారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పడితే సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేందుకు తగిన చర్యలు చేపడతామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చేలా చొరవ చూపాలని సమగ్ర శిక్షా అభియాన్‌ ఉద్యోగులు కోరుతున్నారు.

హామీలు అమలు చేయాలి



మా న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ గతంలో నిరవధిక దీక్షలు చేపట్టాం. తమ ప్రభుత్వం ఏర్పడితే సమస్య పరిష్కరిస్తామని గతంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి.
– గంగాధర్‌, ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సంఘం నిర్మల్‌ జిల్లా అధ్యక్షుడు

మద్యం మత్తులో ఒకరు ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్‌: మద్యం మత్తులో ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్‌ ఎస్సై ఇసాక్‌ తెలిపిన వివరాల మేరకు ఆదిలాబాద్‌ పట్టణంలోని ఖానాపూర్‌ కాలనీకి చెందిన పెన్నంవార్‌ గణేశ్‌ (47) టైలరింగ్‌ చేస్తూ జీవనం సాగిస్తుండగా కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. రాత్రి భార్య, కుమారుడు ఇంటికి వచ్చి చూడగా తలుపుకు లోపలి నుంచి గడియ పెట్టి ఉంది. కిటికీలో నుంచి చూడగా కాళ్లు వేలాడుతూ కనిపించడంతో తలుపులు పగులగొట్టి కిందకు దించారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండగా హుటాహుటిన రిమ్స్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కడుపునొప్పి భరించలేక మహిళ ..

నర్సాపూర్‌(జి): కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన గాదరి అరుణ (40) కొంతకాలంగా కడుపులో నొప్పితో బాధపడుతోంది. బుధవారం సాయంత్రం కడుపునొప్పి తీవ్రం కావడంతో పురుగుల మందు తాగింది. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపడంతో నిర్మల్‌ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందింది. మృతురాలి మేనమామ గుండోల్ల దత్తురాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.



అరుణ(ఫైల్‌)

మనస్తాపంతో ఒకరు...

బోథ్‌: మనస్తాపంతో పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ తెలిపిన వివరాల మేరకు మండలంలోని దేవుల్‌నాయక్‌ తండాకు చెందిన రాథోడ్‌ రోహిదాస్‌ (41) ఇటీవల పత్తి పంట విక్రయించాడు. డబ్బులు తన అకౌంట్‌లో జమ అయ్యాయి. అయితే అతనికి మద్యం సేవించే అలవాటు ఉండటంతో డబ్బులు ఖర్చు పెడతాడన్న ఉద్దేశంతో అతని భార్య రాథోడ్‌ లక్ష్మి తన అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్‌ చేయించుకుంది. దీంతో మనస్తాపం చెంది గురువారం మధ్యాహ్నం ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు బోథ్‌లోని సీహెచ్‌సీకి తరలించారు. వైద్యుల సూచన మేరకు ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుని భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



రోహిదాస్‌ (ఫైల్‌)

లాడ్జి మేనేజర్‌ అరెస్ట్‌

జన్నారంపల్లి: బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి సహకరించిన నిర్మల్‌ జిల్లా కేంద్రంలోని వెంకటసాయి లాడ్జి మేనేజర్‌ సత్యనారాయణను పోలీసులు గురువారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. నిజామాబాద్‌ జిల్లా డిచ్‌పల్లి సీఐ మల్లేశ్‌, జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. అక్టోబర్‌ 1న ఆర్మూర్‌ మండలం అంకాపూర్‌ గ్రామానికి చెందిన అజయ్‌ జక్రాన్‌పల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను నిర్మల్‌లోని వెంకటసాయి లాడ్జికి తీసుకెళ్లాడు. మేనేజర్‌ సత్యనారాయణ నిందితుడి వద్ద ఎక్కువ డబ్బులు తీసుకుని ఓనర్‌కు తెలియకుండా గది ఇచ్చాడు. నిందితుడు బాలికపై అత్యాచారం చేశాడు. అక్టోబర్‌ 30న బాధితురాలి ఫిర్యాదు మేరకు జక్రాన్‌పల్లి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు. నిందితుడు అజయ్‌ని అక్టోబర్‌ 31న పట్టుకుని జైలుకు పంపించారు. నిందితుడు తెలిపిన ఇతర ఆధారాల ప్రకారం లాడ్జి మేనేజర్‌ సత్యనారాయణను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ లాడ్జి, హోటళ్ల నిర్వాహకులు అమ్మాయిలను లాడ్జికి తీసుకొచ్చే వారికి గదులు ఇవ్వొద్దని సూచించారు. డబ్బులకు ఆశపడి నేరాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గర్భంలో శిశువు మృతి

- వైద్యురాలి నిర్లక్ష్యమేనని ఆరోపణ
- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన



మృత శిశువు

ఆదిలాబాద్‌టౌన్‌: ప్రసవం కోసం జిల్లా కేంద్రంలోని పూలే చౌక్‌ సమీపంలోగల ఓ నర్సింగ్‌ హోంకు వెళ్లిన మహిళ గర్భంలోనే శిశువు మృతి చెందింది. వైద్యురాలి నిర్లక్ష్యమే ఇందుకు కారణమని ఆరోపిస్తూ కుటుంబీకులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌ రూరల్‌ మండలం చాంద-టీ గ్రామానికి చెందిన ఉష్కం వెంకటి భార్య లక్ష్మి మొదటి కాన్పు కోసం బుధవారం నర్సింగ్‌ హోంకు వచ్చింది. ప్రసవానికి ఇంకా సమయముందని, గురువారం రావాలని వైద్యురాలు సూచించారు. దీంతో గురువారం మధ్యాహ్నం ఆమెకు నొప్పులు రాగా ఆస్పత్రికి వచ్చి వైద్యురాలికి చూపించారు. ఆమెను మొదటి అంతస్తుకు తీసుకెళ్లాలని సిబ్బందికి చెప్పగా వారు ఆమెను నడిపిస్తూ తీసుకెళ్లారు. ఎన్నిసార్లు పిలిచినా వైద్యురాలు ఆమె వద్దకు రాలేదు. ఆమె నొప్పులతో అల్లాడుతుండగా కిందికి పిలిచారు. మళ్లీ నొప్పులతోనే ఆమె కిందికి వచ్చినా పట్టించుకోలేదు. ఆమె సూచన మేరకు పట్టణంలోని ఓ స్కానింగ్‌ సెంటర్‌కు తీసుకెళ్లి స్కానింగ్‌ తీయించారు. రిపోర్టు పరిశీలించిన వైద్యురాలు గర్భంలో శిశువు మృతి చెందినట్లు తెలిపారు. దీంతో ఆమె కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. తల్లినైనా కాపాడాలని కాళ్లా.. వేళ్లా పడ్డారు. దీంతో రూ.7వేలు డిపాజిట్‌ చేస్తే డెలివరీ చేస్తానని వైద్యురాలు చెప్పారు. శిశువు మృతికి వైద్యురాలి నిర్లక్ష్యమే కారణమని బాధిత కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె తీరును నిరసిస్తూ సాయంత్రం 5నుంచి రాత్రి 8గంటల వరకు ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పలువురు ప్రైవేట్‌ వైద్యులు అక్కడికి చేరుకున్నారు. దీనిపై సదరు వైద్యురాలిని వివరణ కోరగా స్పందించలేదు.

బ్యాంకర్లు మెరుగైన సేవలందించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్‌ కిశోర్‌ కుమార్‌

నిర్మల్‌చైన్‌గేట్‌: బ్యాంకర్లు.. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అదనపు కలెక్టర్‌ (రెవెన్యూ) కిశోర్‌ కుమార్‌ అన్నారు. గురువారం కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో జిల్లా కన్సలిటేటివ్‌ కమిటీ వార్షిక సంస్థలకు రెండో సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు ప్రజలకు ఇచ్చిన రుణాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రుణాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. పేదప్రజలకు, స్వయం సహాయక సంఘాల మహిళలకు, రైతులకు రుణాల మంజూరులో ఆలస్యం కాకుండా చూడాలన్నారు. సైబర్‌ నేరాల బారిన పడి మోసపోకుండా ఖాతాదారులను చైతన్యవంతం చేయాలన్నారు. సమావేశంలో లీడ్‌ బ్యాంకు మేనేజర్‌ రామ్‌గోపాల్‌, ఆర్‌బీఐ ఎల్‌బీవో గిమతి, నాబార్డు డీడీఎం వీరభద్రుడు, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఎస్పీ ప్రభాకర్‌, తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌ రీజనల్‌ మేనేజర్‌ రామారావు, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్‌ నరసింహారెడ్డి, మెప్మా పీడీ సుభాశ్‌, బ్యాంకర్లు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

లక్సెట్టిపేట: మండలంలోని లక్ష్మీపూర్‌ స్టేజీ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్లు ఎస్సై సతీష్‌ తెలిపారు. దండేపల్లి మండలం నంబాలకు చెందిన సురేందర్‌ (33) ద్విచక్ర వాహనంపై లక్సెట్టిపేట నుంచి మంచిర్యాలలోని తన సోదరి ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కోళ్లవ్యాన్‌ ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో మృతి చెందాడు. మృతుని సోదరుడు సుధాకర్‌ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అల్పాహారంలో తగ్గిన పరిమాణం

మందమర్రిరూరల్‌: డ్యూటీ సమయంలో కార్మికులకు అల్పాహారం అందించేందుకు గనిపై నిర్వహిస్తున్న క్యాంటీన్‌లో సింగరేణి యాజమాన్యం మెనూ ప్రకారం పలు ఐటమ్స్‌ చేయిస్తుంది. కొంత క్వాంటిటీ నిర్ణయించి రూ.5కే ప్లేట్‌ (5 పూరీలు)అందిస్తున్నారు. అయితే పరిమాణం తగ్గుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఒక్కోపూరి సుమారు 16 గ్రాముల పైబడి ఉండాల్సి ఉండగా 8 గ్రాములు తగ్గడంతో కార్మికులు ఇదేంటని ముక్కున వేలేసుకుంటున్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి అల్పాహారం పరిమాణం పెంచే విధంగా నిధులు సమకూర్చాలని యూనియన్ల నాయకులు డిమాండ్‌ చేస్తున్నారు.

అకాల వర్షం.. అన్నదాత ఆగం

బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్‌ తుపాను ప్రభావంతో నిర్మల్‌ జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో పోసిన వడ్లు తడిశాయి. నిర్మల్‌ రూరల్‌ మండలం మంజులాపూర్‌, తల్వేద, వెంగ్వాపేట్‌ గ్రామాల్లో మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడవకుండా రైతులు తిప్పలు పడ్డారు. కానీ, వరద పారడంతో చాలా మంది రైతుల ధాన్యం తడిసింది. వర్షం తగ్గాక రైతులు ధాన్యంలోని నీటిని తొలగించారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్‌, నిర్మల్‌



తల్వేద గ్రామ శివారులో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద వరిధాన్యం చుట్టూ వర్షపు నీటిని తొలగిస్తున్న రైతులు



వెంగ్వాపేట్‌లో అకాల వర్షంతో తడిసి ముద్దయిన వరి ధాన్యాన్ని చూపెడుతున్న మహిళా రైతు



తల్వేద గ్రామంలో కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం కుప్పలు



వెంగ్వాపేట్‌లో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న వృద్ధురాలు